# హాం! క్రికెటాయనమః

రాత-గీత- రాంపా

"వరల్డ్ కప్ అయ్యేంతవరకూ ఈ వేడి ఇంతే వుంటుందన్నమాట!" అంది భార్య భద్రగజం.

"కాదు మనవాళ్లు కప్పు పట్టుకుని అలా పైకెత్తి చూపిస్తూ షాంపేన్ సురగలు సంతోష సముద్రపు చెలియలికట్ట దాటేంతవరకు." చెప్పాడు భర్త శ్రీకాకుళేశ్వరరావు అదే శ్రీకాకుళం.

"చివరి బంతి పడేదాక ఏం జరుగుతుందో చెప్పలేని ఈ ఆట మన చేతుల్లోనే వున్నట్లు, చేతల్లోనే ఉన్నట్లు గంతులేయడమేంటండీ?" మూతి విరుస్తూ అంది.

"నీకు దేశభక్తి లేదోయ్!"

"కాదండీ! మనవాళ్లకి ఎక్కడ గెలుస్తామోనని భయం కదండీ!"

"అదిగో, అదే వద్దు!" గట్టిగా అన్నాడు శ్రీకాకుళేశ్వరరావు.

"నాన్నా! మీ గోల ఆపుతారా కొంచెం." పూర్తిస్థాయి క్రికెట్ ప్లేయరు వేషంలో వున్న కొడుకు మూషికవాహనరావు విసురుగా వచ్చి.

"దేనికి నాన్నా?" అడిగింది భద్రగజం.

"మేం క్రికెట్ ఆడుకోవాలి."

"వెళ్లి ఆడుకోండి."

"ఎక్కడికో వెళ్లేట్టయితే మీ గోలతో మాకేం పని?"


క్రికెట్ కిట్టూ మ్యాటూ మోసుకుని మిగతా ప్లేయర్లు కూడా వచ్చారు.

"ఏంరా వేద్దామా?" అడిగాడొకడు మ్యాటు కింద పెడుతూ.

"అప్పుడే వద్దు. గ్రౌండ్ అథారిటీ పర్మిషన్ ఇంకా రాలేదు."

"నడి ఇంట్లో క్రికెట్టేవిటిరా?" అంది భద్రగజం.

"వీధిలో ఆడితే చుట్టుపక్కలవాళ్ల గోల



బాల్కనీలో ఆడదామంటే పనిమినిషి బట్ట లారేయాలి, టెర్రెస్‌మీద ఆడదామంటే పక్క ఫ్లాటాంటీ వడియాలు ఎండబెట్టింది. పోనీ జింఖానా గ్రౌండ్స్‌కెళ్లి ఆడుకుందామంటే అక్కడ ఇరవై టీంలు ఆడుతుంటాయి. ఎవరి బంతి ఎవరికి ఎక్కడ కొట్టుకుంటుందో తెలియదని మీరే వద్దన్నారు నాన్నా!"

"అవును పిల్లవాడు చెప్పిందాంట్లో చెప్పకూడంది ఏంలేదుగా" గంభీరంగా చెప్పాడు శ్రీకాకుళం.

"ఇదెక్కడి విడ్డూరం!" కేకపెట్టింది భద్రగజం.

"ఎక్కడ పడితే అక్కడుంది. ఈ మహానగరంలో ఎన్ని అద్దాలు పగిలాయో, ఎన్ని లైట్లు రాలి కిందపడ్డాయో, ఎన్ని గోడలకు చిల్లులు పడ్డాయో నీకేం తెలుసు" చెప్పాడు శ్రీకాకుళం.

"మొన్న మాయింట్లో స్ట్రెయిట్ డ్రైవ్ చేస్తే టీవీ కిందపడి రెండుముక్కలైందాంటీ" చెప్పాడు కొడుకు ఫ్రెండు.

"మంచి పనయింది. టీవీగోల తప్పిందన్నమాట!" అంది భద్రగజం.

"వెంటనే మా డాడీ కొత్త టీవీ కొన్నారాంటీ!" చెప్పాడు ఫ్రెండు.

"మీ డాడీక్కూడా ఈ ఆటమీద మోజేనా!" అడిగింది ఆశ్చర్యంగా.

"వాళ్ల డాడీ ఎంచక్కా లుంగీతో వచ్చి మాతో ఆడుతారు. ఎంత ఇంట్రెస్టో!" చెప్పాడు మూషికవాహనం సంతోషంగా.

"ఇంతకీ ఇప్పుడేమంటారు?"

"ఆడుకుంటామంటాం."

"ఏదీ! మన ఇంట్లోనే!"

"మన ఇంట్లోనే, మన హాల్లోనే!"

"ఏమండీ! ఇవ్వాళ మన ఓనరు కిరాయి తీసుకోడానికి వస్తానన్నాడు గదండీ" గుర్తుకొచ్చి చెప్పింది.

"ఆఁ వస్తే వచ్చాడు, ఆయన మాత్రం మేచ్ వుందంటే, తలకాయ బయటికి తీయడు. ఏదో పిల్లలు ముచ్చట పడుతున్నారు" లాలనగా చెప్పాడు శ్రీకాకుళం.

"సరే ఓ కండిషన్. నేను ఇచ్చిన బంతీ, నేను ఇచ్చిన బ్యాట్‌తో ఆడుకోవాలి" అంది.

"వూలుండా, రోకలిబండా. అవేగా నువ్విచ్చేది! నాకు తెలియదా?" అన్నాడు మూషికవాహనం.

"రోకలిబండా, విసనకర్ర, బొగ్గులకుంపటి, మరచెంబు మా బామ్మ చెప్పడమే కాని ఇప్పుడెక్కడున్నాయిరా అవీ?" అడిగాడు ఫ్రెండు.

"మా ఇంట్లో ఉన్నాయిలేరా!" ఘనంగా చెప్పాడు.

"సర్లేవోయ్. నేనే పిల్లల్ని గ్రౌండ్‌కి తీసుకెళ్లి దగ్గరుండి ఆడించి తీసుకొస్తా" తన నిర్ణయం చెప్పాడు శ్రీకాకుళం.

"అసలింత సరంజామాతో వచ్చారంటేనే అనుకున్నా ఇదంతా మీ ప్లానే అని."

***

"అయ్యో! అయ్యో! నెత్తి కట్టేవిటండీ. ఆ నెత్తురు గుడ్డలేవిటండీ?"

"నాన్నకు మాట రావట్లేదు, నేనే చెబుతా! పక్క టీంవాళ్లు సిక్సర్ కొడితే నాన్న కేచ్ పట్టుకోబోయాడు" చెప్పాడు మూషికవాహనం.

"అర్థమైంది. మాటకేమైందిరా?"





"ఓ వారం రోజులుదాకా మాటలు రావట! దవడ పట్టేసిందట."

"డాక్టరుగారు మందులేమన్నా రాశాడా?"

"టండా మతలబ్ కోకాకోలా - తాగించమన్నాడు."

"డాక్టరుగారిక్కూడా క్రికెట్ పిచ్చే అన్నమాట!"

"మేచ్ చూస్తూ మందు లేకుండానే ఓ పేషంటుకి సూది గుచ్చాడు."

"పేషంటు గొడవ పెట్టలేదా?"

"లేదు. పేషంటుక్కూడా క్రికెటంటే ఎనలేని ప్రేమట! మాంగే మోరన్నాట్ట!"

"అందుకేనేమో ఇండియాలో క్రికటనేది ఓ రిలిజియన్ అని మొన్నో కామెంటేటర్ చెప్పాడు. సరే, లేచిన వేళ మంచిదైంది. వెళ్ళి పడుకోండి!" భర్తకు సైగ చేసింది.

"ఇవాళ ఇండియా-పాకిస్తాన్ మ్యాచ్!" అన్నాడు కొడుకు.

"మేచ్ లేదు గీచ్ లేదు టీవీ ముట్టుకుంటే వాత పెడతా!" అరిచింది భద్రగజం.

"ఏదన్నా మేచ్ చూస్తే వెంటనే మాటొచ్చే అవకాశముందన్నాడు కదే డాక్టరంకుల్."

"ఏమక్కరలేదు. వారం రోజులైనా ఇంట్లో కేకలు పెడబొబ్బలు లేకుండా ప్రశాంతంగా వుంటుంది."

"లేదు, మాచ్ చూడాల్సిందే!" గదిలోంచి మంచం మీదనుంచే కేక పెట్టాడు శ్రీకాకుళం.

"నాన్నకు మాటొచ్చిందోచ్!" గంతులేశాడు మూషికవాహనం.

"ఏమాటకామాట. బాబాయిగారి ఇంట్రెస్టు మెచ్చుకోవాలి. మానాన్నగారు కూడా ఇంతే వుండేవారాంటీ, క్రికెట్ మేచంటే చాలు కాశ్మీరైనా, కన్యాకుమారైనా వెళ్ళొచ్చేవారు. గుండు చేయించుకుని గుండుమీద జెండా రంగులు పూసుకుని స్టేడియంలో గగ్గోలు పెట్టేవారు. ఆయనెక్కడ కనపడతారో అని మేం కళ్ళు వాచేదాకా మేచ్ చూసేవాళ్ళం" చెప్పింది వనజ.

"కనబడ్డారా?" అడిగింది భద్రగజం.

"ఆ ఒక్కసారి గుండు, జెండా విడివిడిగా



కనిపించాయి. జెండామాత్రం మనదేగాని గుండెవరిదో గుర్తుపట్టలేకుండా వుంది."

"పాపం! అర్థాయుష్షు! ఎలా ముంచుకొచ్చిందో ఏమో!" తలుచుకుంది భద్రగజం.

"ఓసారి ఇండియా గెలుస్తుందనుకున్న మాచ్ ఓడిపోయేసరికి గుండాగి పోయిందని పేపర్లో వార్త వచ్చిందే అది మా నాన్నగారే" కళ్ళు తుడుచుకుంది వనజ.

"ఓడిపోవడం కొత్తా ఏంటి ప్రాణం మీదకు తెచ్చుకున్నాడు పాపం! " అంది భద్రగజం.

"నీకంతే వుంటుందోయ్, మీ తాతయ్య లాహోర్లో వున్నాడని అటూ ఇటూ కాకుండా మాట్లాడతావు!" శ్రీకాకుళం నోరు చేసుకున్నాడు సమయం దొరికింది చాలు అన్నట్లు.

"అయ్య బాబోయ్! దానికి, దీనికీ సంబంధం లేదండోయ్" విలపించింది భద్రగజం.

"మరిప్పటి నుంచి నెగెటివ్ టాకింగ్ మానేసేయ్!" చెప్పాడు శ్రీకాకుళం.

"ఓ‌, మీరే చూస్తారుగా!" అంది.

"మనబ్బాయి టెస్ట్ ప్లేయర్ అవుతాడా?" పరీక్ష చేద్దామన్నట్లు అడిగాడు శ్రీకాకుళం.

"తప్పకుండా అవుతాడు. ఇప్పటినుంచే వాడు బాట్ ఊపుతున్నట్లు, బాల్ విసురుతున్నట్లు వీడియో క్లిప్పింగులు రెడీ చేసి పెడదాం. కపిల్ దిల్‌సేలో చూపించాల్సి వస్తే పనికొస్తాయి. కాకపోతే..." ఆగింది భద్రగజం.

"అదిగో, కాకపోతే అన్నావంటే ఏదో వంకరమాట వచ్చేట్లుందన్నమాట."

"అబ్బే, ఏం లేదండి. తాతగారి పేరు తాతగారి పేరు అనుకుంటూ వాడికి మూషికవాహనరావు అని పెట్టారు. రేపు ఆ పేరుతో కామెంట్రీ స్పీడ్ తగ్గుతుందేమోనని..." గొణిగింది భద్రగజం.

"యంకే వాహన్! యంకే వాహ్ అని పిలుస్తారు లేవోయ్!"

"అప్పుడది (స్టీలు వాల్) స్టీవ్‌వా లాగా క్రికెట్ ప్లేయరు పేరులాగా వుంటుంది కదండీ" అంది.

"అదీ! ఇప్పుడు దారికొచ్చావు."

***

"ఎందుకండీ, ఏదో కోల్పోయిన వాడిలాగా దిగులుగా వున్నారు?"

"ఏంలేదోయ్! మనవాళ్ళు ఒక వికెట్ పడితే చాలు వరస కట్టడం అనే అలవాటు ఎలా పోగొట్టాలా అని ఆలోచిస్తున్నాను."

"ఏం చేద్దామనుకుంటున్నారు?" అడిగింది.


"ఇంద్రజాలం నేర్చుకుని శూన్యరూపంలో వెళ్ళి బెయిల్స్ బదులు వికెట్ల మీద పడుకుందామనుకుంటున్నాను."

"బ్రెట్లీ బంతి విసిరితే మూడుముక్కలై పడతారు" శ్రీకాకుళం కోపంగా చూశాడు.

"కీడెంచి మేలెంచాలి గదండీ!" తడబడుతూ అంది.

"క్రీడెంచి మేలెంచు. నేను సిమెంటుతో వికెట్లు చేయిస్తా."

"లాభం లేదు."



"అన్నిటికీ అంతే చెబుతున్నావు. ఏం చేయాలో చెప్పు!"

"బాట్స్‌మెన్ వెనక నుంచుని మీరే బంతి బౌండరీ అవతలకి విసిరేయాలి."

"ఇది బాగుంది."

"లెండి! స్నానం చేసి సిద్ధం కండి, టీవీ పెట్టండి. గంగూలీ టాస్ గెలిచాడు."

"అయితే చూడాల్సిందే!"

***

"ఏమండీ! కొత్త ఇంటికి గుమ్మడికాయ కట్టినట్టు కలలొస్తున్నాయండీ! హౌస్ లోన్ వస్తుందన్నారు వచ్చిందా?" అడిగింది భద్రగజం.

"వచ్చింది!" నిర్లిప్తంగా చెప్పాడు.

"మరి నేను రైతు బజారుకెళ్ళి గుమ్మడికాయ తెచ్చుకోనా?"

"బండెడు తెచ్చుకో!"

"అదేంటండీ! లోన్ రాలేదా?" అడిగింది.

"విమానం టికెట్లు తీసుకున్నాను." తల పక్కకు తిప్పుకుని చెప్పాడు.

"ఆహా! ఇప్పటిదాకా కిందనుంచి పైకి చూడడమే ఈ జీవితం అనుకున్నా. ఇప్పుడు పైనించి కిందకి చూసే అదృష్టం పట్టిందన్న మాట నాకు!" అంది.

"నీకు పట్టలే. అది నన్నూ నా కొడుకునే పట్టింది!" చెప్పాడు.

"నన్నాట పట్టిస్తున్నారు లెండి. ఇంతకీ ఎక్కడికండీ ఎగిరేది?"

"సౌతాఫ్రికాలో ఫైనల్స్ చూడడానికి. నువ్విక్కడే వుండి మ్యాచ్ రికార్డు చేయి. ఏ మూలనన్నా మేం కనపడవచ్చు" చెప్పాడు శ్రీకాకుళం ఆర్డరు వేస్తున్నట్లు.

"మీరిలా అంటారని తెలిసే మీకు తెలియకుండా నాకూ టికెట్ బుక్ చేయించా!" చెప్పింది భద్రగజం.

"దేనికి. క్రికెట్ చూడడానికా?" ఆశ్చర్యంగా అడిగాడు శ్రీకాకుళం.

"కాదు లాన్స్ క్లూసనర్ ఇంటికెళ్ళి ఆయన పక్కన నించుని ఓ ఫొటో తీయించుకువద్దామని." అంది.

"ఆ!!"

■